# మంచివాళ్లే కదా!

బదరీ నారాయణ బస్సు దిగి, ఆ మండు టెండలో పడి మైలు దూరం నడిచి యిల్లు చేరుకున్నాడు.

బట్టతల మీద ముత్యాలు పరిచినట్లు చెమట బిందువులు తళ తళ మెరిసి పోతున్నాయి. బనీనూ, షర్టూ పూర్తిగా తడిచిపోయి శరీరానికి అంటుకున్నాయి.

ఇంట్లో అడుగు పెట్టగానే అంతా చీకటిగా అనిపించి ఏమీ కనిపించక ఓ క్షణం అలాగే నిలబడి పోయాడు.

'అయ్యో' ఎండలో నడిచి వచ్చారా' సిటీ బస్సులో రాలేక పోయారా'' అంది వర్ధనమ్మ- ఆయన విప్పేసిన షర్టు, బనీనూ తీసుకు వెళ్ళి పెరటి తాడు మీద ఆరబెడుతూ

ఆయన సమాధానం చెప్పకుండా బాత్‌రూంకి వెళ్ళి ముఖం, కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చాడు

టర్కిష్ టవల్ అందించింది వర్ధనమ్మ

దానితో బట్టతల కాస్త తుడుచుకొని, తర్వాత ఆపి "ఛీ ఛీ నీ కెన్ని సార్లు చెప్పాలి? చుట్టాలు వచ్చినప్పుడు గానీ ఈ తువ్వాలు తీయ వద్దన్నానా'" అని చిరాకు పడిపోయి భార్యకిచ్చేశాడు

వర్ధనమ్మ ఆ తువ్వాలు పట్టుకుపోయి – రంగు వెలిసిపోయి చిరుగులు పట్టి కంపు కొడుతున్న మరో తువ్వాలు తెచ్చి యిచ్చింది

దానితో తృప్తిగా తుడుచుకొని, వాలు కుర్చీలో కూర్చుని ఎదురుగా వున్న కుర్చీ మీదకు కాళ్ళు చాపుకున్నాడు బదరి – హాయిగా

వెళ్ళిన పని ఏమయిందండీ?' అడిగింది వర్ధనమ్మ ప్రక్కనే చాప మీద కూర్చుంటూ

ముఖం అంతటా చిరునవ్వు వ్యాపించగా "ఏమవుతుందే' వాళ్ళు భేషుగ్గా ఒప్పుకున్నారు' కట్నం అక్కరలేదు, పిల్ల నచ్చితే చాలు అన్నారు' వారం రోజుల్లో చూపుల కొస్తారు" అన్నాడు

'ఈ రోజుల్లో కట్నం లేని పెళ్ళా'' లాంఛనాలు దండిగా లాగుతారు కాబోలు" అంది వర్ధనమ్మ అనుమానంగా

"నీ బొంద! అదేమీ కాదు' ఆయనకు ఆదర్శాల పిచ్చి! పెద్ద కొడుక్కి కట్నం తీసుకోలేదు ఇప్పుడీ రెండో కొడుక్కీ తీసుకోడు "

"అయితే అబ్బాయి ఆరోగ్య వంతుడేనా?" మరింత అనుమానంగా అడిగింది వర్ధనమ్మ – ఆరోగ్యం అన్నమాట ఒత్తి పలుకుతూ'

'బంగారం' మేలిమి బంగారం'' తులం నాలుగు వేలు ఖరీదు చేసే మహా మేలిమి బంగారం లాంటి వాడు ఆ కుర్రాడు' చూస్తావుగా" గొప్పగా చెప్పాడు బదరి



నాలుగు వేల జీతగాడు సీనియర్ లెక్చరర్ బదరీ నారాయణది అదో తత్వం. సైకిల్ కొనే స్తోమత ఉన్న రోజుల్లో కాలి నడకనే వెళ్ళే వాడు స్కూటర్ కొనే స్తోమత ఉన్న రోజుల్లో సైకిల్ కొన్నాడు' కాఫీ తాగాలనిపిస్తే ఆయన హోటల్‌కి వెళ్ళడు' ఫ్రెండ్స్ యింటికి వెళ్తాడు' కాలేజీలో పాఠాలు కూడా పొదుపుగానే చెబుతూ ఆరోగ్యాన్ని కాపాడు కుంటున్నాడు'

ఆయన కిద్దరే అమ్మాయిలు – శిరీష, మనీష

పెద్దమ్మాయి శిరీష ఎమ్మెస్సీ పాసై ప్రయివేటు స్కూలులో టీచర్‌గా పని చేస్తోంది జీతంలో కొంత నెలనెలా బ్యాంక్‌లో పడేస్తుంది ఇప్పుడామె అకౌంట్‌లో ఇరవై వేలున్నాయి కూతురు పెళ్ళికని బదరి పాతిక వేలు వేర్పాటుగా ఉంచాడు

ఇంక వేట ప్రారంభింఛాడు

పీనాసి పీనుగుల కాళ్ళకే అదృష్ట తీగలు ఎదురొచ్చి చుట్టుకుంటూ ఉంటాయి' అదేవిదంగా బదరీ నారాయణకు భద్రాద్రి రామయ్య ఎదురయాడు

భద్రాద్రి రామయ్య – అంతా ధైవేచ్ఛ అని నమ్మినవాడు సంపాదన నెత్తిన పెట్టుకు పోతామా అన్న వైరాగ్యంతో పెరిగిన వాడు పిల్లలు డబ్బు పిచ్చికి ఎర కాకుండా పెంచాడు ఆయన మంచి తనం వల్ల లబ్ధి పొందిన వాళ్ళు కూడా ఆయన్నొక వెర్రి బాగుల వాడిగా జమకట్టి చాటుగా నవ్వుకుంటారు

వర్ధనమ్మ పూనుకొని పెళ్ళి చూపులు ఘనంగానే ఏర్పాటు చేసింది మర్యాదలు ఖరీదుగానే జరిపించింది

"వాళ్ళు మంచి వాళ్ళేకదా' లోటు పాట్లున్నా సర్దుకు పోతారు అంత ఖర్చెందుకో? అని బదరి మొత్తుకున్నా ఆమె వినలేదు

నిజానికి ఆ మర్యాదలు చూసే ముగ్ధుడై పోయిన భద్రాద్రి వెంటనే సంబంధం ఖాయం చేసుకున్నాడు

అదిగో ఆ తర్వాతనే బదరికి యింటిలో బాధలు ప్రారంభం'

అర్ధ రూపాయికి ఆరు అంగుళాల గోచిగుడ్డ దొరకని ఈ రోజుల్లో అర్ధణాతో ఆరుగజాల చీర కొనడాన్కి ప్రయత్నించే రకం – బదరి' కట్నం లేదు కాబట్టి పెళ్ళి బారీగా చెయ్యాలని వర్ధనమ్మ తాపత్రయం "వాళ్ళు మంచి వాళ్ళేకదా' సర్దుకు పోతారని" ఎక్కడి కక్కడ ఖర్చు తగ్గించే ప్రయత్నం ఆయనది' కళ్యాణ మండపానికి అద్దె వెయ్యి రూపాయిలు' కాలేజీలోనే పెళ్ళి చేసేస్తే ఆ వెయ్యి మిగులుతుంది కదా!

కాలేజీ ఆడిటోరియంలో పెద్ద స్టేజి ఉంది. సెలవులు కాబట్టి స్టూడెంట్స్ బెడద ఉండదు వియ్యాల వారికి హాస్టల్‌లో బస ఏర్పాటు చెయ్యవచ్చు

"అక్కడ అంతా పెచ్చులూడిన గోడలు' నీళ్ళు రాని కుళాయిలు' కంపు గొట్టు లెట్రిన్స్ ' అభ్యంతరం

ప్రఫుల్లచంద్ర

చెప్పింది వర్ధనమ్మ.

"వాళ్ళు మంచి వాళ్ళే కదా! సర్దుకు పోతార్లే" అనేశాడు బదరి.

మూడు వందల మందికి డిన్నరు ఖర్చు లెక్క చెబుతుందామె. "వంద మందిని పిలుద్దాం.... ఏభై మంది వస్తారు' అంటా డీయన! రెండు కూరలు, రెండు పచ్చళ్ళు, సాంబారు, రసం అని లిస్టు రాస్తుందామె. ఒక కూర, ఒక పచ్చడి, సాంబారు వద్దు, రసం చాలు– అని కోత పెడతాడీయన

"మళ్ళీ మళ్ళీ చెయ్యడానికిది బొమ్మల పెళ్ళి కాదు! అమ్మాయి పెళ్ళి! జీవితాని కొకటే పెళ్ళి! మరువురాని విధంగా మధురంగా, ఆర్భాటంగా చెయ్యాలి!" అంటుందామె "అమ్మాయి సుఖంగా ఉండడం ముఖ్యంగాని ఆడంబరాలెందుకో?" అంటా డీయన! ఆమె – కాదు, కూడదు – అని ఏమన్నా అంటే "వాళ్ళు మంచి వాళ్ళే కదా! మరేం ఫర్వాలేదులే" అని సర్ది చెబుతాడీయన

పెళ్ళికి అమ్మాయి డబ్బు ఖర్చు పెట్టాలా? తన డబ్బు ఖర్చు పెట్టాలా? అని తీవ్రంగా ఆలోచించాడు.

వాళ్ళు ససేమిరా కట్నం వద్దు అంటున్నారు అమ్మాయేమో తన డబ్బుతో వాళ్ళ గుమ్మం తొక్కితే – అది వాళ్ళ కెంత అవమానం! అదీ కాక పెళ్ళికి మరో అమ్మాయి సిద్ధంగా ఉంది ఎలాంటి వాడు దొరుకుతాడో, ఎంత కట్నం గుంజుతాడో! అందువల్ల తన డబ్బు దాచేసి, అమ్మాయి డబ్బే ఖర్చు పెట్టాలి అనుకున్నాడు.


భర్త తత్వం తెలిసిన వర్ధనమ్మ యిక వాదించలేదు శిరీష – బ్యాంక్ నుండి డబ్బు తీసి తండ్రికిచ్చేసింది ఆ డబ్బు చేతిలో పడ్డాక – అదంతా ఖర్చు పెట్టడాన్కి మనసొప్పలేదు బదరికి కొంత మిగుల్చుకోవాలని బడ్జెట్ లెక్కలూ గట్రా మళ్ళా రివైజ్ చేశాడు!

పెళ్ళి వారు తెల్లవారు ఝామున ట్రెయిన్ దిగి ఆశ్చర్య పోయారు విడిదికి తీసుకు వెళ్ళడాన్కి బాజాలు, భజంత్రీలు సన్నాహాలు ఏమీ లేవు బదరి ఒక్కడే స్టేషన్ కొచ్చి వాళ్ళని రిక్షాల్లో విడిదికి చేర్చి – యిప్పుడే వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు– రిక్షా కిరాయి అయినా యివ్వకుండా! ఇంక పెళ్ళివారి పాట్లు!

బాత్‌రూంలో గాని టాయ్‌లెట్స్‌లో గాని నీళ్ళు రావడం లేదు ఓవర్ హెడ్ టాంక్‌లో ఒక్కచుక్క నీళ్ళులేవు దాన్ని నింపే మోటారుపని చేయడంలేదు! గోడల నిండా బూతు బొమ్మలూ, పిచ్చి రాతలూ!

కబురు మీద కబురు పంపితే – వచ్చిన బదరి వెర్రిముఖం వేసుకుని సారీ! టాంక్ నిండా నీళ్ళు పట్టమని ఒకడ్ని పెట్టానిక్కడ వాడేమో మోసం చేశాడు" అన్నాడు దీనంగా

విడిదికి రైల్వే స్టేషన్ దగ్గరే స్టేషన్ మాస్టర్ భద్రాద్రికి తెలిసిన వాడే అందుకని ఒక్కొక్కరూ వెళ్ళి వెయిటింగ్ రూమ్‌లో కాలకృత్యాలు తీర్చుకొని వచ్చారు




ఎనిమిది గంటలకు ఒక బేసిన్‌నిండా ఉప్మా, ఒక తపేళాతో టీ తీసుకొచ్చింది పెళ్ళి కూతురు చెల్లి మనీష

ఆ ఉప్మా కంపు. కంపు రోడ్డు ప్రక్క డబ్బా హోటల్లో కొన్న సరుకులాగ ఉంది ఇంట్లో చేయించింది కాదు!

మనీష చూస్తూ ఉండగానే ఉప్మా విసిరికొట్టి నలుగురూ నాలుగూ అనేశారు మనీష బెదరిపోయి కన్నీళ్లతో యింటికి పారిపోయింది

ఆడ పెళ్ళివారి ఆంతర్యం ఏమిటో అర్థం కాలేదు పెళ్ళి కొడుకు హరీష్‌కి

"అర్థం కాకపోడాని కేముంది" మన మంచితనాన్ని లోకువ కట్టేశాడు మనం కూడా యాభై వేలు కట్నం గుంజి అయినదానికీ కానిదానికీ అల్లరి చేస్తే అప్పుడు అడుగులకు మడుగు లొత్తి సకల మర్యాదలూ ఘనంగా జరిపేవాడు!' కసిగా అన్నాడు అతని అన్న జగదీష్

పెళ్ళి పందిరి ఎంత శోభాయమానంగా ఉందో అదీ చూద్దామని బయలు దేరారు అన్నదమ్ములు

పెచ్చులూడిన సిమ్మెంట్ స్టేజి అది అష్ట దిక్కంగా నాలుగు తోరణాలు కట్టారు అంతే కళ్యాణ మంటపం గాని, అలంకరణలుగాని, రంగుల బల్బులు గాని ఏమీ లేవు.

జీవితంలో ఒకే ఒక్కసారి జరుపుకునే అరుదైన వేడుక- పెళ్ళి. ఆ వేడుక ఒక మధుర స్మృతి లాగ మదిలో మిగిలిపోవాలి. కాని తన పెళ్ళి పీడకలలాగ వెంటాడేటట్టు ఉంది. ఈ దరిద్రగొట్టు ఏర్పాట్లు చూసి తన ఫ్రెండ్స్ ఎంత నవ్వుతారో! ఎంత అవమానం!

Acc. No. Vetapalem

# మంచి వాళ్ళే కదా!


హరీష్ ముఖం గంభీరంగా మారిపోయింది.'

"మంచిని గౌరవించలేని చవట! మర్యాద తెలియని పీనాసి పీనుగ! ఇలాంటి వెధవలనుండి మనం మర్యాద గుంజుకోవాలి! ఎందుకు లెమ్మని మంచితనంతో మనం సర్దుకుపోతే- లోకువ అయిపోతాం! ఏయ్ మన్నే డిమాండ్ కర్మేసీ! నీ స్థానంలో నేనుంటే పెళ్ళి రద్దు చేసుకుని యింటికిపోయి హాయిగా ముసుగుతన్ని పడుకునే వాడిని!'' అన్నాడు జగదీష్ తమ్ముడి చెయ్యి పట్టుకొని లాక్కుపోతూ

* * * * * *

విడిది నుండి గాభరాగా యింటికి పరుగెత్తుకు వచ్చిన బదరి తమ్ముడు- "వాళ్ళెవరూ భోజనాలు చేయలేదు సామాన్లు సర్దుకుంటున్నారు వెళ్ళిపోతారో, ఏమో'' అన్నాడు కంగారుగా

మంచివాళ్ళని నమ్మినందుకు వాళ్ళింత ద్రోహం తలపెడతారా- అనిపించింది కాబోలు, ఉలుకూ పలుకూ లేకుండా దిగ్భ్రాంతిగా ఉండిపోయాడు




బదరి. వర్ధనమ్మ కొరకొరా ఆయన బట్టతల వైపు చూసింది. నిగనిగా మెరుస్తున్న ఆ తలమీద అప్పడాల కర్రతో ఒక్కటిచ్చుకోవాలనిపించినా నిగ్రహించుకొని-

"ఇంకా కదలరేమండీ! విడిదికి వెళ్ళి బ్రతిమాలి వాళ్ళని ఆపు చేయండి'' అంది రోషంగా.

బదరి కదలలేదు "వాళ్ళంతో మంచి వాళ్ళని నమ్మి మోసపోయాం'' అని గొణుక్కున్నాడు.

ఇంటిలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అందరూ బదరి చుట్టూ మూగారు అందరికీ ఆయనంటే అసహ్యమే!

"నీళ్ళు నమలక వెళ్ళవయ్యా! వెళ్ళి వాళ్ళ కాళ్ళా వేళ్ళా పడి సర్దిచెప్పుకో'' అని కసురుకున్నాడు

అందుకు కావలసిన నైతిక బలం లేని బదరి నువ్వు వెళ్ళకూడదూ?- అని బ్రతిమాలుతున్నట్లు భార్య వైపు చూశాడు

ఎవరూ వెళ్ళనే అక్కర లేకపోయింది ఎందుకంటే పెళ్ళి కొడుకు, అన్నతో అక్కడకేవస్తున్నాడు

తళతళలాడే పట్టు చీర, గంపెడు పూలు, కళ్యాణ తిలకం, కాటుక రేఖలూ పెళ్ళి కూతుర్ని అలంకరించాలంటే- ఒహో, ఎంత సరంజామా కావాలి! కాని శిరీషను అలంకరించడాన్కి వచ్చిన స్నేహితురాళ్ళకు అవేమి కనిపించలేదు సాదా చీర చుట్టబెట్టి ఒక పావలా పువ్వులు జడలో పెట్టి ఐదు నిమిషాల్లోనే అలంకరణ పూర్తి చేశారు

వాళ్ళంతా బదరికి శిష్యురాళ్ళే గురువుగారి పీనాసితనం వాళ్ళకి తెలుసు కాని, కూతురి డబ్బుతో కూతురి పెళ్ళి చేస్తూ అందులోనే కొంత కమీషన్ కొట్టేసేటంత పీనాసి పీనుగు-

అనుకోలేదు వాళ్ళు! చేసే పని లేక పీనాసి జోకులు వేస్తూ కూర్చున్నారు

శిరీష తల వంచుకొని కూర్చుంది హీరోయిన్ పెళ్ళి వేడుకలు ఎన్నో సినిమాల్లో చూసి తనని అలా ఊహించుకొని ఎన్నెన్నో కలలు స్మృతులో ఉంచుకున్న ఆమెకు తీవ్ర ఆశాభంగంగా ఉంది. హృదయం కుతకుతలాడి పోతోంది. ఫ్రెండ్స్ వేళా కోళాలతో ఆమె తల మరింత వాలిపోయింది "ఛీ, నాన్న మరీ యింత పీనాసి ఏమిటి!" అనుకుంది

'పెళ్ళి కొడుకు యిక్కడికేవస్తున్నాడు!"

అని ఎవరో అరిచారు అదీ వేళాకోళమే అనుకుని శిరీష తల ఎత్తలేదు కానీ చుట్టూ చెలరేగిన సంభ్రమం, హడావుడీ, తడబాటూ గమనించి తల ఎత్తింది.

ఎదురుగా హరీష్! ఆ వెనుకనే జగదీష్!

తత్తరపాటుగా లేచి నిల్చుని తలవంచుకుంది శిరీష

శతకోటి సూదుల పోటు లాగ ఒక నిముషం నిశ్శబ్దం

"మేం మంచి వాళ్ళం!... మంచిగా మసలు కోడాన్కి ప్రయత్నించేవాళ్ళం! కానీ మా మంచితనాన్ని అలుసుగా తీసుకొని అవమానిస్తే మాత్రం సహించం! కట్నం తీసుకోనందుకు సంతోషించి ఏర్పాట్లు భారీగా చేస్తారనుకున్నాం. కానీ కనీస మర్యాదలు కూడా కరువయ్యాయి! . మేం వెళ్ళిపోతున్నాం'' కటువుగా వినిపించింది జగదీష్ స్వరం

ఉలిక్కిపడి తల ఎత్తింది శిరీష

కళ్ళు కావవి! కన్నీటి కొలనులు! అందరికీ షాక్! ఒక్కరూ మాట్లాడలేదు

"కానీ తండ్రి చేసిన తప్పుకి తనయని శిక్షించడం మానవత్వం కాదని మాకూ తెలుసు అందుకని మీ కొక అవకాశం యిస్తున్నాం'' ఈసారి సాక్షాత్తూ పెళ్ళి కొడుకే అన్నాడు

అందరూ ముందుకు తోసుకు వచ్చి ఆసక్తిగా అతని వైపు చూస్తూ ఉండిపోయారు

ఇప్పుడు జగదీష్ ముందు కొచ్చి అన్నాడు "మీ తండ్రి- కూతురు పెళ్ళి కూడా చేయలేని దరిద్రుడని నిర్ణయించుకున్నాం ఇంక ఆయనతో మాకు సంబంధంలేదు ఇప్పుడే మేము విడిది కాళీ చేసి లాడ్జింగ్‌కి వెళ్ళిపోతున్నాం మీకు అభ్యంతరం లేకపోతే యిదే ముహూర్తానికి వెంకటేశ్వర కల్యాణ మండపంలో మా స్వంత ఖర్చుతో ఈ పెళ్ళి జరిపిస్తాం అయితే ఒక షరతు! మేము చేసే మీ పెళ్ళికి మీ ఫ్రెండ్స్ రావచ్చు కాని మీ తలిదండ్రులు రాడాన్కి వీల్లేదు! అందుకు మీరు అంగీకరిస్తే ఒక గంటలో లాడ్జికి కబురు పంపండి మీ నుండి ఏ కబురూ రాకపోతే . ఈ సాయంకాలం బండికి మేము మా ఊరు వెళ్ళిపోతాం ''

రకమని వెనక్కి తిరిగి చకచకా వెళ్ళిపోయారు అన్న, తమ్ముడు

వాళ్ళు అటు వెళ్ళగానే-

వర్ధనమ్మ భద్రకాళిలాగ భర్తమీద విరుచుకు పడింది.

"నాన్నా! నా డబ్బు నా కిచ్చెయ్! నా పెళ్ళి నేనే చేసుకుంటా'' అరిచేసింది శిరీష.

బంధువులంతా సూటి మాటల శూలాలతో ఆయన్ని పొడిచేశారు.

అందరూ పెళ్ళి కొడుకు ఔదార్యాన్ని పొగడ్డమే! అందరూ బదరిని తెట్టడమే!

పరిస్థితి ఒక్కసారిగా ఎదురు తిరిగేసరికి బదరి తల తిరిగి పోయింది అతగాడు వెంటనే బ్యాంకికి వెళ్ళి తన డబ్బు కూడా విత్‌డ్రా చేసి భార్య చేతిలో పెట్టి "ఎంత ఖర్చయినా సరే, పెళ్ళి ఘనంగా జరిపించు'' అని కాళ్ళు చాపేశాడు

ముహూర్తాని కింకా పన్నెండు గంటల వ్యవధి ఉంది

ఒక రూపాయి ఖర్చు పెట్టవలసిన చోట రెండు ఖర్చుపెడితే వ్యవధి చాలదన్న సమస్యే లేదు

శిరీష ఫ్రెండ్స్ పూనుకొని పెళ్ళి పెళ్ళున జరిపించేశారు

○